

మత సామరస్యానికి చిహ్నం

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై హిందూ, ముస్లింల సమైక్యతకు చిహ్నంగా చెప్పే బషీర్‌బీబీ ఉర్సు ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది.




భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగిన అపచారంపై నిందితులను శిక్షించాలని వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్ చేశారు.

8 లో

9,745 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,745 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.35 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

కలెక్టర్ ఎదుటే అవమాన పరిచారు

జెడ్పీటీసీ సభ్యుడి ఆవేదన



ప్రజా ఫిర్యాదుల వేదిక ముందు ఉన్న గ్యాలరీలో కూర్చున్న జెడ్పీటీసీ సభ్యుడు

రాజానగరం: సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లిన తనను ప్రజాప్రతినిధినని కూడా చూడకుండా అవమానించారని వైఎస్సార్ సీపీకి చెందిన రాజానగరం జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' సోమవారం జరిగింది. ఈ క్రమంలో తాను కూడా కొన్ని సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే కలెక్టర్ ఎదుటనే సిబ్బంది అవమానకరంగా ప్రవర్తించారన్నారు. ప్రజా ప్రతినిధినైన తనను కూడా అందరితోపాటు క్యూ లో రావాలని సిబ్బంది ఆదేశించడం ఆశ్చర్యపరచిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్షంలోని ప్రజాప్రతినిధులకు ముఖ్యంగా బీసీ, ఎస్సీలకు కనీసం గౌరవ, మర్యాదలు కూడా లభించడం లేదని అన్నారు.

మధ్యవర్తిత్వంపై లాయర్లకు శిక్షణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారం అయ్యే అవకాశం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక జిల్లా కోర్టు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశ మందిరంలో జ్యుడీషియల్ అధికారులకు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వం కాన్సెప్ట్, టెక్నిక్‌లపై శిక్షణ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. దీనికి హాజరైన సునీత మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 24 వ తేదీ వరకు ఈ శిక్షణ అందించనున్నామన్నారు. కోర్టు సంబంధిత కేసుల్లో పరిష్కారానికి నాలుగు విధానాలు ఉన్నాయన్నారు. దీనిలో మధ్యవర్తిత్వ రాజీ మార్గం, లోక్ ఆదాలత్ అనే రెండు అంశాలుగా ఉన్నాయన్నారు. దీనిలో మధ్యవర్తిత్వం కు సూచించిన కేసులకు సంబంధించి కేసు పరిష్కారం అయ్యే విధంగా శిక్షణ పొందిన జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లను నామినేట్ చేస్తామన్నారు. వీరు సంబంధిత కేసులో ఇరు పార్టీలను పిలిపించి వారితో ఆమోదయోగ్యం దిశగా సంతకాలు చేయించి ఆరు నెలల లోపు కేసు రాజీ అయ్యే విధంగా పరిష్కరిస్తారన్నారు. ఇలా పరిష్కారమయ్యే కేసులకు లోక్‌అదాలత్ మాదిరిగానే అప్పీల్ కూడా ఉండదన్నారు. కోర్టుకు చెల్లించిన ఫీజు కూడా తిరిగి ఇస్తారన్నారు. కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎ.గాయత్రీదేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, సీనియర్ శిక్షకులు సురీందర్ సింగ్ (ఢిల్లీ), ఎస్.అరుణాచలం (తమిళనాడు), జ్యుడీషియల్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పురోగతిలో ఉన్న గృహ నిర్మాణాలు (ఫైల్)

గూడుపురాణి

- పేదలపై కూటమి సర్కారు సరికొత్త కుట్ర
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇంటి స్థలాల పట్టాల రద్దుకు రంగం
- నిర్మాణాలు ప్రారంభించలేదన్న నెపంతో వాటిని తొలగించేందుకు సిద్ధం
- తమ పార్టీల నేతలకు కట్టబెట్టేందుకు పావులు
- జిల్లా వ్యాప్తంగా 3,128 ఇళ్ల స్థలాలు రద్దయ్యే అవకాశం
- ఆందోళనలో లబ్ధిదారులు

సాక్షి, రాజమహేంద్రవరం: పేదల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేసే దిశగా అడుగులు వేస్తోందా? గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఉన్న అక్కసుతో నిరుపేదలకు అన్యాయం చేస్తోందా? గృహ నిర్మాణాలు ప్రారంభించలేదన్న నెపంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల పట్టాలు రద్దు చేసేందుకు పావులు కదుపుతోందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. స్థలం మంజూరై పనులు ప్రారంభించని వాటిని రద్దు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో పేదల సొంతింటి కల.. కలగానే మిగిలిపోయే పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రారంభం కాని గృహ నిర్మాణ పనులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు తెగుతుండటం వెనుక అంతర్యం ఏంటన్న ప్రశ్న లబ్ధిదారుల్లో ఉత్పన్నమవుతోంది. పనులు పూర్తయి పేదలు తమ సొంత ఇళ్లలోకి వెళితే.. గత ప్రభుత్వానికి పేరు వస్తుందని భావిస్తున్న కూటమి సర్కారు ఇలాంటి చర్యలకు దిగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో 3,128 పట్టాలు రద్దు?

పట్టాలు పొంది ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల పట్టాలు రద్దు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అధికారుల లెక్కల ప్రకారం పరిశీలిస్తే జిల్లా వ్యాప్తంగా 3,128 మంది పట్టాలు తొలగించనుంది. వీరందరూ సొంతింటి కలకు దూరం కానున్నారు. తమకు ప్రభుత్వం స్థలం మంజూరు చేసిందన్న వారి సంతోషం ఆవిరి కానుంది. తమకు స్థలం ఉందని, రూ.5 లక్షలకు పైగా ఆస్తి ఉందన్న భరోసాతో తమ పిల్లల చదువులు, పెళ్లిలకు కొందరు అప్పులు చేశారు. ప్రస్తుతం అది తమ చేజారిపోతోందన్న ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం చేసిన తప్పులకు తాము బలికాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. గృహ నిర్మాణాలకు పూర్తిగా సహకరించకుండా పనులు ఎలా ప్రారంభించాలంటూ ప్రశ్నిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక నత్తనడక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గృహ నిర్మాణాలకు నత్తకు మేనత్తను తలపిస్తున్నాయి. పక్కా ఇళ్లకు మార్చి నెల తర్వాత కేంద్రం నిధులు నిలిపివేస్తుందని, అప్పటిలోగా పూర్తి చేసుకోవాలని టార్గెట్ పెట్టారు. లక్ష్యాలు సైతం నిర్దేశించిన ప్రభుత్వం సాధనకు మాత్రం ఆ దిశగా అడుగులు వేయలేదు. ఆరు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం నిర్మాణ పనులపై దృష్టి సారించకపోవడంతో పురోగతి పడకేసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెరసి ఎక్కడి నిర్మాణ పనులు అక్కడే నిలిచిపోయాయి. కాలనీలు పిచ్చిమొక్కలతో నిండుతున్నాయి.

ఫలించని వంద రోజుల ప్రణాళిక

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించిన అధికార యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. 4,875 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. వీటిని గతేడాది డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని భావించారు. అనుకున్న సమయానికి కేవలం 331 మాత్రమే పూర్తి చేశారు. ఇంకా పూర్తి చేయాల్సిన 4,544 ఇళ్లు ఈ ఏడాది సంక్రాంతికి పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించుకుని విఫలమయ్యారు.

ప్రస్తుతం ఇలా..

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు' పథకంలో 431 లేఅవుట్లలో 65,075 ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో 47,053 ఇళ్లు, ప్రైవేటు స్థలాల్లో 18,022 ఇళ్ల నిర్మాణాలకు నాంది పలికారు. అధికారిక లెక్కల ప్రకారం గతేడాది డిసెంబర్ నెలాఖరు వరకు పురోగతి పరిశీలిస్తే.. 26,359 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 17,965 పురోగతిలో ఉన్నాయి. పునాది ప్రారంభ దశలో 17,623, బేస్‌మెంట్ లెవల్‌లో 6,485, లింటల్ లెవెల్ 2,087, రూఫ్ లెవెల్ 1,289, పైకప్పు స్థాయిలో 1,584 ఉన్నాయి. ఇంకా ప్రారంభం కానివి 25 వేలకు వరకు ఉన్నాయి. గత ప్రభుత్వం స్థలాలిచ్చి ఇళ్లు మంజూరు చేసింది. మార్చి వరకు పూర్తి కాకపోతే నిధులు మంజూరు కావని ప్రభుత్వం చెబుతోంది.

జిల్లాలో పట్టాలు రద్దయ్యే లబ్ధిదారుల వివరాలు ఇలా..

మండలం	రద్దయ్యే పట్టాలు
అనపర్తి	124
బిక్కవోలు	18
చాగల్లు	280
దేవరపల్లి	30
గోపాలపురం	33
కడియం	85
కోరుకొండ	32
కొవ్వూరు	166
నల్లజర్ల	137
నిడదవోలు	213
పెరవలి	159
రాజమహేంద్రవరం అర్బన్	416
తాళ్లపూడి	934

గత ప్రభుత్వంలో వేగంగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు' పథకంలో గృహనిర్మాణాలు వేగంగా సాగాయి. ఇంటి పట్టాలు మంజూరు చేసిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కావడం.. ఆ ప్రక్రియ నిరంతరాయంగా సాగడంతో జిల్లాలో గృహ నిర్మాణ పనులు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచాయి. దీనికి తోడు సకాలంలో బిల్లులు రావడంతో లబ్ధిదారులు త్వరితగతిన పనులు చేపట్టారు. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు మూడు రకాల ఆప్షన్లు ఇచ్చారు. వారి అభీష్టం మేరకే నిర్మించుకునే అవకాశం కల్పించారు. పనులకు అవసరమైన సిమెంట్, ఇసుక, స్టీల్ అతి తక్కువ ధరకే గృహ నిర్మాణ శాఖ ద్వారా అందజేశారు. ఒక్కో ఇంటికి రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణం సైతం మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 25,316 గృహాలు అన్ని హంగులతో పూర్తయ్యాయి.

సీతారామపురం కార్యదర్శికి షోకాజ్ నోటీసు

ప్రజ ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రశాంతి



ప్రజా ఫిర్యాదుల వేదికలో అర్జీలు అందుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే తగిన చర్యలు తీసుకోకతప్పదని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి హెచ్చరించారు. మండలంలోని సీతారామపురం పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేస్తున్న విషయాన్ని మీడియాకు తెలియజేస్తూ పై విధంగా అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజల నుంచి వివిధ సమస్యలపై 59 దరఖాస్తులొచ్చాయి. రంగంపేటకు చెందిన కొంతమంది వ్యక్తులు ఏడీబీ రోడ్డు విస్తరణలో తమ భూములు పోయాయని, ఇంతవరకు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారంగా అందలేదని వాపోయారు. ఇందుకు కారణాలను తెలుసుకుని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీతారామపురం పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి పై కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులపై కార్యదర్శి సహేతుకమైన సమాధానం ఇవ్వలేక పోయారు. గ్రామంలోని స్థితిగతులపైన, సమస్యల పైన ఆమెకు ఏమాత్రం అవగాహన లేకపోవడమే కాకుండా తరచుగా సెలవులు పెడుతూ బాధ్యాతారాహిత్యంగా విధులు నిర్వర్తించడాన్ని కలెక్టరు తీవ్రంగా పరిగణించారు. దీంతో కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నానన్నారు. నందరాడ పంచాయతీ కార్యదర్శిపై ప్రజల నుంచి ఫిర్యాదులొచ్చాయి. అయితే మండలంలో ఈ ఇద్దరి పైనే ఫిర్యాదులొచ్చాయి. మిగిలిన వారంతా విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నట్టుగా భావించరాదన్నారు. చాలామంది కార్యదర్శులు గ్రామ సిబ్బందిపై ఆధారపడుతున్నట్టుగా పరిశీలనలో గ్రహించామన్నారు. ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తిస్తే సమస్యలే ఉండవన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వడం నేరం

అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపట్టడం నేరం అవుతుందన్నారు. గతంలో ఇక్కడ ఇటువంటి చర్యలు ఎక్కువగా జరగడం వల్లనే తహసీల్దారును మార్చవలసి వచ్చిందన్నారు. మండలంలోని రామస్వామిపేట, ప్రాథమిక పాఠశాల ఏడీబీ రోడ్డు విస్తరణలో పోతున్నందున ప్రభుత్వం నుంచి వచ్చిన నష్టపరిహారాన్ని సద్వినియోగం చేసి, మరోచోట పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ, ఎంఈఓలకు సూచించారు. జాయింట్ కలెక్టరు చినరాముడు, డీఎల్‌డీఓ వీణాదేవి, ఎంపీడీఓ జేఎల్ ఝాన్సీ, తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి, ఎంపీపీ మండారపు సీతారత్నం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 23 అర్జీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం' (పీజీఆర్ఎస్)కు 23 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ నిర్వహించి పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలు అందించారు. ఎస్పీ నరసింహకిశోర్ వారి బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.

సొసైటీ ఉద్యోగుల ధర్నా



డీఆర్‌వో సీతారామ్మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ ఉద్యోగ సంఘ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సొసైటీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జీవో 36 ప్రకారం పేస్కేల్స్ అమలు పరచాలని, గ్రాట్యుటీ చట్ట ప్రకారం ఇవ్వాలని, ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, 2019 తరువాత ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓ సీతారామ్మూర్తికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు తోట వెంకటరామయ్య, జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రామచంద్రం, కోశాధికారి జి.సుధాకర్ వర్మ పాల్గొన్నారు.

త్వరలో మరో 10 ఓపెన్ ఇసుక రీచ్‌లు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో 9 ఓపెన్ రీచ్‌ల వద్ద 5,51, 000 మెట్రిక్ టన్నులు, 10 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద 5,37,018 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, త్వరలో మరో 10 ఓపెన్ రీచ్‌లు, ఆరు సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల ద్వారా 77 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, మార్గదర్శకాల ప్రకారం బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యులను ఇసుక రీచ్‌లలో తవ్వకాలు, లోడింగ్‌కు అనుమతించామన్నారు. నిడదవోలు మండలం పురుషోత్తంపల్లి రీచ్‌కి ఫిబ్రవరి 10, కొవ్వూరు ఆరికిరేవుల రీచ్ 11న , తాళ్లపూడి మండలం తాడిపూడి, పక్కిలంక రీచ్ 12న, నిడదవోలు మండలం పెండ్యాల, కొవ్వూరు మండలం చిడిపి, సీతానగరం మండలం సింగవరం ఇసుక రీచ్‌లకు ఫిబ్రవరి 13 న పబ్లిక్ హియరింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా ఆర్డీవోలు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. కొత్తగా గుర్తించిన కడియం మండలం వేమగిరి ఏ, పెరవలి మండలం తీపర్రు ఏ, బి లు, నిడదవోలు మండలం జీడిగుంట ఏ, బిలు, పందలపర్రులో కొత్తగా గుర్తించిన సెమీ మెకనైజ్డ్ రీచెస్ మైనింగ్ ప్లాన్ అనుమతికి ప్రతిపాదనలను సిద్ధం చేసుకుని, ఇరిగేషన్ అధికారుల ద్వారా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇసుక రవాణా చేస్తూ నియమ నిబంధనలను ఉల్లంఘించిన 77 వాహనాలను సీజ్ చేసి, నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. 480 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చెయ్యడం, రూ.24,71,000 అపరాధ రుసుం విధించడం, యంత్ర పరికరాల వాడకం, అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్న నేపథ్యంలో మూడు రీచ్‌లకు చెందిన కాంట్రాక్టు ఉత్తర్వులు రద్దు చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఈఈ (ఇరిగేషన్ రివర్ కన్సర్వేటరీ) ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బీవీ గిరి, ఇన్చార్జి డీపీవో ఎం.నాగలత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఇరిగేషన్ డీఈ బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

అందరమొకటై తరిమేద్దాం

- కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే ప్రారంభం
- జిల్లాలో 1,310 బృందాలతో పరిశీలన
- ముందస్తు చికిత్సతో అంగవైకల్యం దూరం
- అవగాహనతోనే వ్యాధికి చెక్



నల్లజర్ల మండలం పుల్లలపాడులో సర్వే నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సర్వే బృందం

రాజమహేంద్రవరం రూరల్: కుష్టువ్యాధి సోకితే అంగవైకల్యం రావొచ్చు, రోగులను తక్కువ చేసి చూడకుండా అసలు వ్యాధినే తరిమివేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి వైద్యశాఖ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యం నుంచి కాపాడొచ్చు. అంతేకాకుండా వ్యాధిని దూరం చేసి అందరితో పాటు సంతోషంగా జీవించేలా చేయొచ్చు.

వైద్యశాఖ ఎన్ని చర్యలు తీసుకున్నా ఈ వ్యాధి వ్యాపిస్తోంది. జిల్లాలో కొన్నేళ్లుగా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయినా అక్కడక్కడా కొత్తవి నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 82మంది ఈ వ్యాధిన బారినపడ్డారు. ప్రస్తుతం వీరికి చికిత్స చేస్తున్నారు. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తిని కొందరు చిన్నచూపు చూస్తారు. ఇది ఒకరి నుంచి ఒకరికి సోకే ప్రమాదం లేదు.

జిల్లాలో 13 కాలనీలు

జిల్లాలో అధికారికంగా 702 మందిలో కుష్టు వ్యాధి వల్ల ఏళ్ల తరబడి అంగవైకల్యంతో కొంత మంది, మరికొంతమంది చిన్న చిన్నలోపాలతో బాధపడుతున్నారు. వీరి కోసం జిల్లాలో 13 కాలనీలను ఏర్పాటు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంవత్సరానికి రెండుసార్లు ఎంసీఆర్ చెప్పులు అందజేస్తోంది. సబ్బులు, టవల్స్ ఇస్తోంది. గాయాలు పెరగకుండా గట్టి పడిన చర్మం మెత్తపడేందుకు కాళ్లు, చేతులకు రాసుకునేందుకు ఆలివ్, వేపనూనెను పంపిణీ చేస్తోంది. స్వచ్ఛంద సంస్థలు, దాతలు సాయం చేస్తున్నారు.

అవగాహన పెంచుకుని..

కుష్టు అంటువ్యాధి కాదు. ఆ వ్యాధి ఉన్న వారితో ఏళ్ల తరబడి కలిసి ఉంటే ముక్కు, నోటి ద్వారా తుంపర్ల రూపంలో బ్యాక్టీరియా వ్యాపించవచ్చు. ఇతరుల చర్మంపై కోతలు, గాయాలుంటే అంటుకునే ప్రమాదముంది. ఒకసారి బ్యాక్టీరియా సోకితే దాని లక్షణాలు 2 నుంచి 20 సంవత్సరాల కాలంలో ఎప్పుడైనా బయటపడవచ్చు. ఈ వ్యాధిపై అవగాహన పెంచుకుని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కుష్టు రాకుండా ఉండటానికి టీకాల్లేవు. అయితే క్షయకు వాడే బీసీజీ టీకా కొంతమేరకు కుష్టు కొత్తవారికి రాకుండా ఉండేందుకు సాయపడుతుందని నూతన అధ్యయనాలు పేర్కొంటున్నాయి. శరీరంపై మచ్చలుంటే సకాలంలో డాక్టర్‌కు చూపించుకుని మందులు వాడితే కుష్టు రాకుండా అరికట్టవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో ఉంటే ఈ వ్యాధి కారకజీవులు వ్యాపించవని చెబుతున్నారు.

ఇంటింటి సర్వే ప్రారంభం..

సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీవరకు జిల్లాలో లెప్రసీ(కుష్టు) సర్వే నిర్వహిస్తారు. ఇందుకోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 1,310 బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఏఎన్ఎం సూపర్‌వైజర్‌గాను, ఆశా కార్యకర్త, మేల్ వలంటీర్‌లు ఉంటారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. కుష్టుకు సంబంధించిన మచ్చలతో పాటు తామర, బొల్లి లాంటి మచ్చలున్నాయా అని ఆరా తీస్తారు. మచ్చలున్న వారిని సమీపంలోకి పీహెచ్‌సీకి తీసుకెళ్లి అక్కడి డాక్టర్లతో మళ్లీ పరీక్ష చేయిస్తారు. కుష్టుమచ్చలుగా అనుమానిస్తే నిర్ధారణ చేస్తారు. సాధారణమైతే వాటికి కూడా మందులు ఇస్తారు.

జిల్లా సమాచారం

సర్వేలో పాల్గొనే బృందాలు	– 1,310
జిల్లాలో యూపీహెచ్‌సీలు	– 15
జిల్లాలో పీహెచ్‌సీలు	– 35
అంగవైకల్యంతో బాధపడుతున్నవారు	– 702 మంది
కొత్తగా చికిత్స పొందుతున్నవారు	– 82 మంది

ప్రజలు సహకరించాలి



కుష్టు వ్యాధి లేని ఉన్నతమైన సమాజం కోసం చేస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలి. వైద్యశాఖ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు శరీరంపై ఎలాంటి మచ్చలున్నా తెలయజేయాలి. కుష్టు వ్యాధి మచ్చలుగా అనుమానిస్తే పరీక్షలు చేయించి నిర్ధారణ అయితే వారి వివరాలు గోప్యంగా ఉంచి చికిత్స అందిస్తాం. ముందస్తు చికిత్స చేస్తే వ్యాధి నయమవుతుంది. భవిష్యత్తులో అంగవైకల్యం రాకుండా కాపాడొచ్చు.

– డాక్టర్ ఎస్.వసుంధర, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి, తూర్పుగోదావరి

ఆధ్యాత్మిక చైతన్యానికే మహాసభలు

అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు పరావిద్యానందగిరి స్వామిని



సాధు పరిషత్ మహాసభలో ప్రసంగిస్తున్న అధ్యక్షురాలు మాత పరావిద్యానందగిరి స్వామిని

దేవరపల్లి: ప్రజల్లో ఆధ్యాత్మిక, ధార్మిక చైతన్యాన్ని కలిగించడం కోసం సభలు మహాసభలు ఏర్పాటు చేస్తున్నట్టు అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షులు మాతా పరావిద్యానందగిరి స్వామిని అన్నారు. ఏటా వివిధ ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న అఖిలాంధ్ర సాధు పరిషత్ రెండవ రోజు సోమవారం నిర్వహించిన సభలో మాతా విద్యానందగిరి స్వామిని ప్రసంగించారు. మహాసభలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. దేవరపల్లి, నల్లజర్ల, చాగల్లు, కొవ్వూరు, గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లోని పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలి వచ్చి స్వాముల ఆధ్యాత్మిక ధర్మ ప్రబోధాలను భక్తి శ్రద్ధలతో ఆలకించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 3.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సభలు నిర్వహించారు. పరిషత్ అధ్యక్షులు మాతా పరవిద్యానందగిరి స్వామిని ఆధ్వర్యంలో మహాసభలు నిర్వహిస్తున్నారు. హిందూమతం ప్రాధాన్యం గురించి స్వామిజీలు వివరిస్తున్నారు. మానవులంతా సన్మార్గంలో నడవాలని స్వామీజీలు సూచించారు. సత్యానందాశ్రమ పీఠాధిపతులు హరితీనకర్త స్వాముల అధ్యక్షతన జరిగిన సభలో పలువురు పీఠాధిపతులు, ఆశ్రమాల స్వామీజీలు ప్ర సంగించారు. సభలో పీఠాధిపతులు కమలానంద భా రతీ స్వామి, విశ్వంభరానంద గిరి స్వామి, పరబ్రహ్మానందగిరి స్వామిని, సత్యానందగిరిస్వామి, శుద్ధబ్రహ్మానందగిరి స్వామి, ప్రేమానంద భారతీ స్వామి, వీరానంద బ్రహ్మచారి, నిర్విశేషానందగిరి స్వామిని, సనకసనందన సరస్వతీ స్వామి ఆధ్యాత్మిక ధర్మ ప్రబోధాలు చేశారు. రాత్రి సభ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. ఆహ్వాన సంఘం సభ్యులు పీఠాధిపతులు, స్వాములను సత్కరించి ఆశీర్వాదం పొందారు. వ్యాపారి కరుటూరి ధనుంజయ, రోజా దంపతులను పీఠాధిపతులు, సాధు పరిషత్ అధ్యక్షులు మాతా పరావిద్యానందగిరి స్వామిని సత్కరించి ఆశీస్సులు అందజేశారు. ఆహ్వాన కమిటీ సభ్యులు గద్దే మునేశ్వరరావు, బళ్ళ సూర్యచక్రం, బలుసు సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, సుంకవల్లి వెంకటరామారావు, ఆచంట వెంకటసత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, కరుటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభలకు ఏర్పాట్లు చేశారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,500 – 16,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

మత సామరస్యానికి చిహ్నం

- బషీర్‌బీబీ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- భారీ ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- వచ్చే నెల 7 నుంచి ప్రారంభం

కొత్తపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై హిందు, ముస్లింల సమైక్యతకు చిహ్నంగా చెప్పే బషీర్‌బీబీ ఉర్సు ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. కొత్తపల్లి మండలం పొన్నాడలో జరిగే ఈ ఉత్సవాలకు మన ప్రాంతంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. దూర ప్రాంతాల భక్తులు మూడు రోజుల పాటు దర్గా ప్రాంగణంలోనే ఉండి ఉత్సవాలు పూర్తయ్యాక వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. పొన్నాడలో బషీర్‌బీబీ ఔలియా (బంగారు పాపమ్మ) దర్గాకు ప్రత్యేకత ఉంది. ముస్లింలే కాకుండా హిందువులు, క్రైస్తవులతో పాటు కుల, మత భేదాలు లేకుండా అంతా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం విశేషం. ముస్లింల దేవతైన బషీర్‌బీబీని స్థానికంగా బంగారు పాపమ్మ అని పిలుస్తుంటారు. పూర్వం బషీర్‌బీబీ ఏడు అంతస్తుల భవనంలో ఉండేదని, తన బంగారాన్ని పేదలు శుభకార్యాలు నిర్వహించేటప్పుడు అప్పుగా ఇచ్చేవారని.. శుభకార్యం పూర్తయిన వెంటనే తిరిగి ఆ బంగారాన్ని ఆమెకు ఇచ్చేవారని స్థానికులు చెబుతుంటారు. పేదలకు బంగారం అప్పుగా ఇవ్వడం వల్ల ఆమెకు బంగారు పాపమ్మ అనే పేరు సార్థకమైందని వివరిస్తుంటారు. ప్రస్తుతం పొన్నాడలో ఉన్న బషీర్‌బీబీ దర్గా గతంలో ఏడు అంతస్తులు ఉండేదని, రానురాను ఆరు అంతస్తులు భూమిలోకి కూరుకుపోగా పైఅంతస్తు మాత్రమే కనిపిస్తుందని పెద్దలు చెబుతుంటారు. బషీర్ బీబీని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందువల్ల భక్తులు మూడు రోజుల పాటు అధిక సంఖ్యలో పాల్గొని బషీర్ బీబీని దర్శించుకుంటారు. ఈ మూడు రోజులూ తీర్థం జరుగుతుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో ముజావర్లు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహిస్తారు. ఉన్న ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



పొన్నాడలో వేంచేసియున్న బషీర్‌బీబీ (దర్గా)దేవాలయం



బషీర్‌బీబీకి ప్రార్థనలు చేస్తున్న భక్తులు

భారీ బందోబస్తు

బషీర్ బీబీ ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు భక్తుల సౌకర్యార్థం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అధిక సంఖ్యలో భక్తుల వాహనాల వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని చూపనున్నారు. వచ్చే నెల 9న భక్తులు ఇంకా అధిక సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉందని, ఆ రోజు రేడియో, టీవీ సింగర్ మధ్య కాంపిటేషన్ ఏర్పాటు చేసినట్లు ముజావర్లు తెలిపారు.

ఉత్సవాల నిర్వహణ ఇలా..

ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ 70వ ఉర్సు ఉత్సవాలు ప్రారంభంమవుతాయి. 9న గంధోత్సవం నిర్వహిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం మూలపేటలకు చెందిన షేక్ మౌలాసాహెబ్ ఇంటి నుంచి గంధాన్ని బ్యాండ్ మేళాలతో గుర్రంపై ఊరేగింపుగా తీసుకొస్తారు. ఆ గంధాన్ని అమ్మవారికి పూసిన అనంతరం భక్తులకు పంచిపెడతారు. మూడు రోజుల పాటు దర్గాలో విశేష ప్రార్థనలు నిర్వహిస్తారు.

మూడు తరాల నుంచి ప్రార్థనలు



ఉర్సు ఉత్సవాలకు భక్తుల తాకిడి పెరుగుతోంది. బషీర్‌బీబీ దర్శించుకుంటే తమ కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ప్రార్థనలను మూడు తరాలకు పైగా మా కుటుంబం వారు నిర్వహిస్తున్నారు. ఇందులో గంధోత్సవం ఎంతో ముఖ్యమైంది. బషీర్‌బీబీకి పూసిన గంధాన్ని తీసుకునేందుకు భక్తులు పోటీ పడుతుంటారు.

–అబీదా, స్థానిక ముజావరురాలు, పొన్నాడ

మా కోరిక నెరవేరింది



గత ఏడాది బషీర్‌బీబీని దర్శించుకుని సంతానం కలగాలని మొక్కుకున్నాను. నా కోర్కె ప్రకారం పండంటి మగబిడ్డ పుట్టాడు. బషీర్‌బీబీని కోరుకోవడం వల్లనే నాకు సంతానం కలిగింది. పుట్టిన బిడ్డతో బషీర్‌బీబీ దర్శనం చేసుకుని ఊయలలో బిడ్డను వేసి మొక్కుబడి తీర్చుకున్నా.

–సున్నేరి, భక్తురాలు, కాకినాడ

నేడు టీటీడీసీలో జాబ్ మేళా

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముత్తూట్ ఫైనాన్స్‌లో 100 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఏదైనా డిగ్రీ కలిగి 18 నుంచి 30 ఏళ్ల స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు తూర్పుగోదావరి జిల్లా అంతా పని చేయాల్సి ఉంటుందని, నెలకు రూ.10 వేల నుంచి రూ.16 వేల జీతం ఉంటుందన్నారు. టీమ్ లీజ్ కంపెనీలో 100 ఉద్యోగాలు ఉన్నాయని, 30 ఏళ్లలోపు వయసు కలిగి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. వీరు ఏలేశ్వరం, జగ్గంపేట, ప్రతిపాడులలో పనిచేయాలని, నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల జీతం ఉంటుందన్నారు. అదే విధంగా డక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీలో 50 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు కలిగిన పురుషులు బీఎస్సీ (కెమిస్ట్రీ) కెమిస్ట్రీలో డిప్లమో చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారు తునిలో పని చేయాలని, నెలకు రూ.17 వేల జీతం ఉంటుందన్నారు.

పంట కాలువలో వ్యక్తి మృతదేహం

కాట్రేనికోన: పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలోకి ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. ఆ గ్రామ శ్మశాన వాటిక సమీపంలో పంట కాలువలో మృతదేహం కనిపించింది. అది కుళ్లిపోయి గుర్తుపట్టేందుకు వీల్లేకుండా ఉంది. వయసు సైతం నిర్ధారించలేని పరిస్థితి. పోలీసులు స్పందించి మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తే విషయం బయటకు వస్తుంది.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



బాల (ఫైల్)

కొత్తపల్లి: ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేష్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం మూలపేట గ్రామ ప్రకాష్‌నగర్‌కు చెందిన గింజల బాల (25), అదే గ్రామానికి చెందిన రాచపల్లి ప్రసాద్ ఎనిమిదేళ్ల కిందట ప్రేమించుకుని పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇటీవల బాలను భర్త కువైట్ పంపించాడు. ఆమె అక్కడ ఉండలేక మూడు నెలలకే ఇంటికి తిరిగి వచ్చేసింది. అప్పటి నుంచి ఒకరిపై ఒకరికి అనుమానం కలిగింది. ఇటీవల భర్త ప్రసాద్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని, కావాలనే బాలను అత్తింటివారు ఆదివారం ఉరివేసి చంపేసి హుటాహుటిన మృతదేహాన్ని ఖననం చేశారని మృతురాలి తల్లి లక్ష్మి సోమవారం ఫిర్యాదు ఇచ్చింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

అంబాజీపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వివాహిత మనస్తాపం చెంది తన ఇంట్లోనే చీరతో ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. పుల్లేటికుర్రు శివారు లంకతోటకు చెందిన వాసంశెట్టి సీతామహాలక్ష్మి (46) కొన్నేళ్లుగా ఆస్మా, ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతుంది. దీనికి తోడు తన కుమార్తెకు బైపాస్ సర్జరీ జరగడం, వ్యవసాయ కూలి పనులు లేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపం చెంది సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆమె భర్త నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పమిడిముక్కల: ద్విచక్ర వాహనం అదుపు తప్పి గోడను ఢీకొన్న ప్రమాదంలో కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన విజయవాడ– మచిలీపట్నం జాతీయ రహదారిపై మంటాడ ఫ్లైఓవర్ వద్ద సోమవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా పాత ఇసుకపల్లికి చెందిన దాసరి నిమ్స్ చంద్ర (21) తన బైక్‌పై కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ముత్తా సాయి వీరభద్ర దుర్గ (22)తో హైదరాబాద్ బయలు దేరాడు. మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వస్తుండగా మంటాడ ఫ్లైఓవర్ వద్ద బైక్ అదుపుతప్పి గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చొన్న వీరభద్ర దుర్గ అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రకు తీవ్ర గాయాలవడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వెంటాడిన మృత్యువు

కిర్లంపూడి: మండలంలోని రమణయ్యపేటకు చెందిన ముత్తా పెద్దకాపు, సరస్వతీ దంపతులకు ఇద్దరు కుమారులు. తమ కుమారులను బాగా చదివించి ప్రయోజకులను చేయాలనే తపనతో కష్టపడి చదివించారు. వారి చిన్న కుమారుడు సాయి ఏడాది కిందట కిర్లంపూడి– రాజుపాలెం రోడ్డుపై బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. అల్లారు ముద్దుగా చూసుకున్న చిన్న కుమారుడు మరణంతో ఆ తల్లిదండ్రులు కుంగిపోయారు. ఆ ఘటన నుంచి తేరుకునే లోపు పెద్ద కుమారుడు ముత్తా సాయి వీరభద్రదుర్గ సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతను డిప్లొమా చేసి నాలుగు నెలల క్రితమే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో చేరాడు. తన కుమారుడికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జాబ్ వచ్చిందనే ఆనందంతో ఆ తల్లిదండ్రులు మురిసిపోయారు. మరింత ఉన్నత స్థాయిలో చూసుకుని విశ్రాంతి తీసుకుందామనుకునే లోపే ఈ ఘటన ఆ కుటుంబాన్ని కుదుపేసింది. సంక్రాంతి పండగకు ఈ నెల 11న కిర్లంపూడి వచ్చి కుటుంబ సభ్యులు, స్నేహితులతో వీరభద్రదుర్గ ఎంతో ఉత్సాహంగా గడిపాడు. సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో కలసి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం జరిగి అక్కడికక్కడే మరణించాడు.



ప్రమాద ఘటన వద్ద బైక్



ముత్తా సాయి వీరభద్రదుర్గ (మృతుడు)

పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు



పంట పొలాల్లోకి దూసుకుపోయి ఆగిన ట్రావెల్ బస్

తప్పిన పెను ప్రమాదం

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. బస్సు టైర్ పేలి, అదుపుతప్పి డివైడర్ పైనుంచి, ఎదురు మార్గంలోకి పోయి, రెయిలింగ్‌ను ఢీకొని పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ప్రయాణికులంతా క్షేమంగా బయట పడ్డారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. సుమారు 47 మంది ప్రయాణికులతో విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్ బస్ టైర్ ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో పేలిపోయింది. దీంతో బస్ అదుపుతప్పి డివైడర్‌ను దాటి పక్క రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొని, పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖ మార్గంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ దుర్ఘటన నుంచి డ్రైవర్‌తో సహా ప్రయాణికులంతా క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం సంఘటనా స్థలానికి చేరకుని, పరిస్థితిని సమీక్షించారు. బస్ టైర్ పేలడం మినహా అంతా క్షేమమన్నారు. ప్రయాణికులను వేరే బస్సుల్లో రాజమహేంద్రవరం పంపారు.

ప్రైవేట్ బస్సులపై కేసులు

అమలాపురం రూరల్: సంక్రాంతి పండగ రద్దీ నేపథ్యంలో కోనసీమ జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ బస్సులపై రవాణాశాఖ అధికారులు దాడులు చేశారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో 126 బస్సులపై కేసులు నమోదు చేసి మోటారు వాహన చట్టం కింద రూ. 8,09,675 అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి దేశనీడి శ్రీనివాసరావు తెలిపారు. ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేసిన బస్సు యజమానులపై 56 కేసులు నమోదు చేశారు. ఇతర క్రమరాహిత్యం కింద 71 కేసులు పెట్టామన్నామన్నారు. ఈ తనిఖీల్లో మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, రవికుమార్, శ్రీనివాస్, సురేష్ కుమార్, లక్ష్మీ శ్రీదేవి, కాశీ విశ్వేశ్వరరావు, షణ్ముఖ శ్రీనివాస్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

మహాలక్ష్మిది హత్యే..

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం తోటపేటలోని తోట త్రిమూర్తులు కాలనీలో అనుమానాస్పదంగా మృతి చెందిన దామిశెట్టి మహాలక్ష్మి (54)ని బంగారం కోసం ఓ వ్యక్తి హత్య చేసినట్లు రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ సోమవారం వెల్లడించారు. తోట త్రిమూర్తులు కాలనీకి చెందిన దామిశెట్టి మహాలక్ష్మి తన ఇంట్లో ఈ నెల 12న మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ద్రాక్షారామ శ్మశాన వాటికలో పూడ్చిపెట్టారు. అనంతరం మహాలక్ష్మి మృతిపై బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు పూడ్చి పెట్టిన శవానికి పోస్టుమార్టం చేయగా మహాలక్ష్మిని హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది. అనంతరం పోలీసుల దర్యాప్తులో అదేకాలనీకి చెందిన నాగిరెడ్డి అప్పారావు అనే వ్యక్తి మహాలక్ష్మిని గొంతు నొక్కి హత్య చేసి ఆమె మెడలోని చైన్, వేలి ఉంగరం దొంగిలించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు మహాలక్ష్మి బంధువు సలాది సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఇద్దరి మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాల మెయిన్ గేట్ వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. దీనికి సంబంధించి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. లాలాచెరువు చౌడేశ్వర్ నగర్‌కు చెందిన మేడపాటి ప్రసాదరావు (54) ఆటో నగర్‌లో వెల్డింగ్ వర్కు చేస్తుంటాడు. పని మీద వేరే ప్రాంతానికి వెళ్లిన అతడు ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడి నుంచి దానవాయిపేటలో ఉంటున్న విజయవాడకు చెందిన బంధువు నక్కా సాయి గణేష్ (26) ఇంటికి వెళ్లాడు. రాత్రి కావడంతో తనను చౌడేశ్వర్ నగర్‌లో ఇంటి వద్ద దింపాలని అతడిని కోరాడు. దీంతో వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నెహ్రూనగర్ వైపు నుంచి వస్తున్న వీరు ఆర్ట్స్ కళాశాల మెయిన్ గేట్ వద్ద సమీపంలోని డివైడర్ వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తుండగా లాలాచెరువు వైపు నుంచి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రోడ్డుపై పడిన వీరిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గంట వ్యవధిలో మృతి చెందారు.

లంచం తీసుకున్న పోర్ట్ ఆఫీసర్‌కు రెండేళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కాకినాడ పోర్ట్ ఏరియాలో స్థలాన్ని కేటాయించేందుకు రూ.2 లక్షలు లంచం తీసుకున్న పోర్ట్ ఆఫీసర్ మనం వెంకట కృష్ణమోహన్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. అట్లాస్ ఆఫ్‌షోర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన షేక్ అహ్మద్‌బాషా తనకు పోర్ట్ ఏరియాలో స్థలం కేటాయించాలని కాకినాడ కమిషనర్ ఆఫ్ పోర్ట్ కార్యాలయం, పోర్ట్ ఆఫీసర్ మనం వెంకట కృష్ణమోహన్‌ను అనుమతి కోరాడు. దీనికి గాను వెంకట మోహన్‌కృష్ణ రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. దీనిపై షేక్ అహ్మద్‌బాషా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు వలపన్ని వెంకట కృష్ణమోహన్‌ను పట్టుకున్నారు. నేర నిరూపణ కావడంతో అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ ఏ ప్రకారం ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధించారు. అలాగే యూఎస్ 13 (1), (డి) అవినీతి నిరోధక చట్టం ప్రకారం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు.

వ్యక్తికి ఐదేళ్ల జైలు

గోకవరం: ప్రేమిస్తున్నానని శారీరకంగా వేధించి యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి రాజమహేంద్రవరం పదో అదనపు జిల్లా సెషన్స్ కమ్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధించింది. గోకవరం ఎస్సై పవన్ కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన స్వాతిని పిల్లి ఆనంద్‌బాబు ప్రేమిస్తున్నానని శారీరకంగా ఇబ్బంది పెట్టడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. నేరం రుజువు జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

గోకవరం: రోడ్డు ప్రమాదంలో పెంటపల్లికి చెందిన సాత్నబోయిన దుర్గాప్రసాద్ (23) మృతి చెందాడు. ఆ వివరాల ప్రకారం.. గోకవరంలో సినిమా చూసేందుకు టిక్కెట్ల కోసం దుర్గాప్రసాద్ బైక్‌పై వచ్చాడు. టిక్కెట్లు తీసుకున్న అనంతరం తన స్నేహితుడిని సినిమాకు తీసుకు వచ్చేందుకు వీరలంకపల్లి వెళ్తుండగా గోకవరంలో పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని 108 వాహనంలో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లి, తండ్రి ఉన్నారు. చేతికందివచ్చిన కొడుకు అర్ధాంతరంగా మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

ఏసీ మెకానిక్‌పై యువకుల దాడి

అమలాపురం టౌన్: ఓ ఏసీ మెకానిక్‌పై ఐదుగురు ఇంటర్ చదివిన యువకులు దాడి చేశారు. ఆదివారం రాత్రి స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో ఈ ఘటన జరిగింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట మండలం పసుపల్లి గ్రామానికి చెందిన ఏసీ మెకానిక్ గంటి కిరణ్ ఏసీకి చెందిన ఓ పరికరాన్ని కొనుగోలు చేసేందుకు అమలాపురం పట్టణానికి వచ్చాడు. కొంత సమయం పడుతుందని షాపు నిర్వాహకులు తెలపడంతో సమీపంలో ఉన్న బజ్జీల బండి వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న ఐదుగురు యువకులు ఏసీ మెకానిక్‌తో అకారణంగా గొడవ పడి దాడికి దిగారు. ముఖానికి గాయమైన కిరణ్ చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. మెడికో లీగల్ కేసుగా పరిగణించి అతనికి వైద్యులు చికిత్స చేశారు. దీనిపై బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏసీ మెకానికర్‌ను జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, వీసీకే పార్టీ కార్యదర్శి బొంతు రమణ, నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబుతో కూడిన బృందం సోమవారం సాయంత్రం పరామర్శించింది. ఏసీ మెకానిక్‌పై దాడి చేస్తున్నప్పుడు ఆ యువకుల్లో ఒకరు 'నేను మంత్రి వాసంశెట్టి సుభాష్ రైట్ హ్యాండ్ కొడుకుని అంటూ దాడి చేశారని' బాధితుడిని పరామర్శించిన దళిత నాయకులు వివరించారు. అకారణంగా దాడి చేసిన యువకులను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం నిందితులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ వీరబాబు విచారించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌ను పరామర్శిస్తున్న దళిత నాయకులు

భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం

- అపచారానికి కారకులను కఠినంగా శిక్షించాలి
- వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: పవిత్ర పుణ్యక్షేత్రం కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగిన అపచారంపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. తొలుత స్వామివారి పాదాలకు పసుపునీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. చరిత్ర కలిగిన స్వామివారి ఆలయంలో మద్యం సీసాలు, మాంసం వంటివి ఉన్నాయని చెబుతున్నారని, ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతుందన్నారు. అయినా అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించేది లేదన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుతామన్న జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అపచారంపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. తన కుమారుడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా హయాంలో నియోజకవర్గంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగానే 117 దేవాలయాలకు శ్రీవాణి ట్రస్టు నుంచి నిధులు మంజూరు చేయించారన్నారు. మరో నాలుగు దేవాలయాలకు కామన్‌గుడ్ ఫండ్ నుంచి నిధులు తెచ్చారన్నారు. సీతానగరం మండలం కాటవరం శివాలయం, మండలంలోని మరికొన్ని దేవాలయాలున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాజా హయాంలో స్వామివారి గిరి ప్రదక్షిణ నిమిత్తం రోడ్డు నిర్మిస్తే, దాని నిర్వహణ పనులు జరగడం లేదన్నారు. అన్నవరం దేవస్థానం సహకారంతో మెట్లు నిర్మాణానికి మార్గం సుగుమం చేశారని, అలాగే రంగనాథ స్వామివారి ఆలయ నిర్మాణానికి అనుమతులు తెచ్చారని, ఐదు అంతస్తుల రాజగోపురం, పైన ప్రాకార మండపాన్ని విస్తరించడానికి అనుమతులు తెచ్చారన్నారు. ఆ సందర్భంగా చినజీయర్ స్వామి కూడా వచ్చినట్టు గుర్తుచేశారు. ఎన్నికలు రావడంతో కొనసాగింపు నిలిచిపోయినట్టు తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. భక్తుల్లో అనుమానాలు నివృత్తి చేయాలని, అపచార ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ కోకన్వీనర్ గణేశుల పోస, నాయకులు గుమ్ములూరు సర్పంచ్, నక్కా రాంబాబు, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, కొండపల్లి దుర్గారావు, బొరుసు బద్రి, కంటే వినయ్‌తేజ, పసుపులేటి బుల్లియ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి